క్లుప్తంగా

వై.ఎస్.జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే గణేష్


తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం : తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ గురువారం కలిసారు. నియోజకవర్గంలోని రాజకీయ పరిణాలు, పార్టీ పటిష్టతకు తీసుకుంటున్న చర్యలను పార్టీ అధ్యక్షుడి దృష్టికి తీసుకువెళ్లినట్టు గణేష్ తెలిపారు.

ఎల్.కృష్ణాపురం రోడ్డు ప్రారంభోత్సవం


రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తదితరులు

మాడుగుల : జాలంపల్లి పంచాయతీ ఎల్.కృష్ణాపురం, కామకూటం, రోడ్డు గురువారం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, జెడ్పీటీసీ కిముదు రమణమ్మ, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాద్‌రావు, పుప్పాల రమేష్, ఉండూరు దేముడు, నందారపు సన్యాసిరావు, ఒడ్డి రాజుకుమార్ పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తం

మాడుగుల : ప్రస్తుతం వర్షాకాలంలో పశువులకు సక్రమించే సీజనల్ వ్యాధులపై పశువైద్యాధికారులు దృష్టి సారించాలని పాడేరు డివిజన్ ఉప సంచాలకుడు సిహెచ్.నరసింహులు అన్నారు. గురువారం స్థానిక ఏరియా పశువైద్యశాలను ఆకస్మిక తనిఖీ చేపట్టారు. సమీకృత ఆహారం, గోకులం షెడ్లపై ఆరా తీశారు. ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలపై వివరాలు తెలుసుకుని సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ వి.చిట్టినాయుడు, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ సౌజన్య, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రస్‌లు పంపిణీ


క్రీడాదుస్తులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

నర్సీపట్నం : మండలంలోని పీబీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు అదే పాఠశాలలో పనిచేస్తున్న సోషల్ టీచర్ కె.వి.శేషయ్య స్పోర్ట్స్ డ్రస్‌లు స్పాన్సర్ చేశారు. వీటిని హెచ్ఎం జి.రమణ, పీడీ రవి చేతుల మీదుగా పది మంది క్రీడాకారులకు అందజేశారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

రోలుగుంట : మండలం కేంద్రంలో పాత రామాలయం వద్ద దేవీ నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. భవానీ దీక్షలు చేపట్టేవారు ఇక్కడ కమిటీని సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. దీక్షధారులతో పాటు భక్తుల గోత్రనామాలతో అమ్మవారికి సహస్ర నామ(1008) కుంకుమ పూజ, ఉదయం, సాయంత్రం జరిపించడం జరుగుతుందని, స్థానిక శ్రీ వేంకటేశ్వస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి శ్రీనివాసాచార్యులతో పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

తహసీల్దార్ ప్రసాద్ బాధ్యతల స్వీకారం


చీడికాడ : మండల తహసీల్దార్‌గా వై.ఎస్.వి.వి ప్రసాద్ గురువారం విధుల్లో చేరా రు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన బి.వి.రాణి అనకాపల్లి కలెక్టర్ కార్యలయానికి బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో ప్రసాద్ ఇక్కడకు తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. గురువారం విధుల్లో చేరిన ఆయనకు కార్యాలయం సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నాడు నిధులిస్తే..నేడు నీళ్లొదిలారు..

జిల్లాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో నర్సీపట్నం ముందు వరుసలో ఉంటుంది. ఇది ఏజెన్సీకి ముఖ ద్వారంగా ఉండడం, డివిజన్ కేంద్రం కావడంతో అన్ని వర్గాల ప్రజలు ఇక్కడ నివాసం ఉండేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఎన్నో మౌలిక వసతులున్నా, దశాబ్దాల నాటి తాగునీటి పథకం పెరుగుతున్న జనాభాకు సరిపోక ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలు దృష్టిలో పెట్టుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మాణం తలపెట్టింది. అయితే కూటమి ప్రభుత్వం రాగానే ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

- గత ప్రభుత్వంలో రూ.166.85 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టు రూపకల్పన
- కూటమి ప్రభుత్వంలో పురోగతి లేని పనులు


సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుగా ఏర్పాటు కానున్న నర్సీపట్నం పెద్దచెరువు


బలిఘట్టంలో అసంపూర్తిగా నిలిచిన నిర్మాణాలు


నిరుపయోగంగా పడి ఉన్న పైపులు

నర్సీపట్నం : పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీరు ఏర్పాట్లు లేకపోవడంతో అరకొర నీటిని రోజు విడిచి రోజు సరఫరా చేయాల్సి వస్తోంది. శివారులో ఉన్న కాలనీలకు నీరు అందని దుస్థితి. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో భారీ తాగునీటి ప్రాజెక్టు కార్యరూపం దాల్చింది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇంజినీరింగ్ అధికారులు ప్రాజెక్టుకు రూపకల్పన చేయడంతో, అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో భాగంగా వీధుల్లో పైపులైన్ల ఏర్పాటు, రిజర్వాయర్ల నిర్మాణ పనులు చేపట్టారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు షెడ్యూల్ విడుదల కావడంతో ప్రాజెక్టు నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు కావస్తున్నా ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో పురోగతి లేదు.

భవిష్య అవసరాలకు తగ్గట్టుగా..

మున్సిపాలిటీలో రూ.166.85 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి గత ప్రభుత్వం సంకల్పించింది. రిజర్వాయర్లతో పాటు మున్సిపాలిటీలోని 28 వార్డుల్లో పైపులైన్ల పనులు చేపట్టారు. మైనర్ పైపులైన్ల నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావస్తున్న సమయంలో ఎన్నికలు రావడంతో నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు కావస్తున్నా ప్రాజెక్టు నిర్మాణ పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఉన్న 65 వేల జనాభాలో ప్రతి ఒక్కరికి రోజుకు 45 లీటర్ల చొప్పున నీటి సరఫరా జరుగుతోంది. 2040 నాటికి పెరిగే జనాభాను దృష్టిలో పెట్టుకుని అధికారులు ప్రాజెక్టు రూపకల్పన చేశారు. ప్రాజెక్టు పూర్తయితే ఒక్కొక్కరికి రోజుకు 135 లీటర్ల నీటిని సరఫరా చేసే అవకాశం ఉండేది.

ఎక్కడి పనులు అక్కడే...

కోటవురట్ల మండలం యండపల్లి వద్ద ఏలేరు కాలువ నుంచి నీటిని తీసుకుని వచ్చేందుకు ప్రాజెక్టు రూపకల్పన చేశారు. ఏలేరు కాలువ వద్ద 650 కిలోలీటర్ల సామర్థ్యం ఉన్న సంపును నిర్మాణం చేయాల్సి ఉంది. మున్సిపాలిటీ పరిధిలోని జోగునాథునిపాలెం వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, నర్సీపట్నం పెద్దచెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుగా వినియోగించేందుకు అధికారులు ప్రాజెక్టు రూపొందించారు. కొత్తగా 3,400 కిలోలీటర్ల సామర్థ్యంతో నాలుగు రిజర్వాయర్లను బలిఘట్టం, సీబీఎం కాంపౌండ్, తహసీల్దార్ కార్యాలయం, ఎస్సీ కాలనీలో నిర్మించ తలపెట్టారు. అయితే ఇపుడు ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేసి తాగునీటి కష్టాలు తీర్చాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత


సంత ప్రదేశంలో మొక్కలు నాటుతున్న నాయకులు

బుచ్చెయ్యపేట : మొక్కలు నాటడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసికోవాలని వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి కోరారు. వనం మనం కార్యక్రమంలో భాగంగా మేజర్ పంచాయతీ వడ్డాదిలో ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటారు. పంచాయితీ ఈవో లవరాజు పంచాయతీ, డ్వాక్రా సంఘాలు పలు పార్టీల ప్రజా ప్రతినిధులతో కలిసి మొక్కలు నాటించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా బూడి నియామకంపై హర్షం

కె.కోటపాడు : వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును నియమించడం హర్షణీయమని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు అన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బూడి ముత్యాలనాయుడు ఎంపికపై వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ ఈర్లె గంగునాయుడు, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, సర్పంచ్, ఎంపీటీసీలు బండారు ముత్యాల నాయుడు, రొంగలి వెంకటరమణ, వెంకటరావు, బోశం కృష్ణారావు, సందీప్, ఏటుకూరి రాజేష్, బండారు దేముళ్లు, రొంగలి రమేష్, పైల కోటి, వంటాకు అప్పాజి, వేచలపు దొరబాబు, చీపురపల్లి అచ్చిబాబు, నెక్కల గోపి, ఆదిరెడ్డి రామునాయుడు, బండారు ముత్యాలనాయుడు, పల్లా రాజేష్, భూమిరెడ్డి దేముళ్లు, సతీష్, ద్వారపూడి శ్రీను, శ్రీకాంత్ శ్రీను హర్షం వ్యక్తం చేశారు.

మాడుగుల నేతల హర్షం

మాడుగుల : మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడును జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పలువురు నేతలు కృతజ్ఞతలు తెలిపారు. బూడి నియామకం పట్ల ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, మహేశ్వరి, తలారి అప్పారావు, శ్రీనాదు సూర్యకాంతం గురువారం హర్షం వ్యక్తం చేశారు.

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షునిగా, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడుని నియమించడం పట్ల పార్టీ శ్రేణుల హర్షం వ్యక్తం చేశారు. చోడవరం సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, ఎం.కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రమణబాబు, సీనియర్ వార్డు సభ్యురాలు పడాల కృష్ణవేణి, వి.వి.అగ్రహారం మాజీ సర్పంచ్ నారాయణరావు, కె.జె.పురం పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి కాళ్ల రాము, సర్పంచ్ రమణబాబు, నాయకులు మళ్ల కన్నబాబు, నూక గణేశ్ వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు.

రేబిస్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

నర్సీపట్నం : రేబిస్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం ఏరియా వెటర్నరీ ఆస్పత్రి ఏడీఏ డబ్ల్యూ.రాంబాబు సూచించారు. రేబిస్ వైరల్ వ్యాధి అన్నారు. ప్రధానంగా పశువుల నుండి మనుషులకు వ్యాపిస్తుందన్నారు. నాడీ వ్యవస్థపై దాడి చేసి చివరికి మృత్యువుకు దారి తీస్తుందన్నారు. వందలాది మంది ప్రజలు ప్రతి ఏటా ఈ వ్యాధి కారణంగా చనిపోతున్నారు. జ్వరం, తలనొప్పి, అలసట, నరాల సమస్యలు, ప్రవర్తనలో మార్పులు, ఆగ్రహం, ఆందోళన వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. రేబిస్ వ్యాధికి వ్యాక్సిన్ అందుబాటులో ఉందన్నారు. రేబీసీ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా మనుషులు, పశువులు ఈ వైరస్ బారిన పడకుండా ఉంటారన్నారు. పశువులు, కుక్కలకు రేబీసీ వ్యాక్సిన్ వేయడం ద్వారా వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చన్నారు. మూగ, వన్యప్రాణులను దూరంగా ఉంచుకోవాలన్నారు. కుక్క, ఇతర పశువులు కరిస్తే వెంటనే గాయాన్ని సబ్బుతో శుభ్రం చేసుకుని, వైద్యులను సంప్రదించాలన్నారు.

గ్రామ సభల షెడ్యూల్ విడుదల చేయాలి

దేవరాపల్లి: జిల్లాలో అన్ని పంచాయతీల్లో గ్రామ సభలను రాజ్యాంగ బద్ధంగా జరిపించాలని ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ కోరారు. దేవరాపల్లిలో గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. గ్రామ సభలను సమర్థంగా నిర్వహించేలా అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. అక్టోబర్‌లో జరిగే గ్రామ సభలకు సంబంధించిన షెడ్యూల్‌ను మండల స్థాయిలో వారం రోజుల ముందుగా విడుదల చేసేలా జిల్లాలోని అన్ని మండలాల ఈవోపీఆర్డీలకు ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్, డీపీవోను కోరినట్టు తెలిపారు. గ్రామంలో సంక్షేమ, ఆర్థిక ప్రగతితో పాటు గ్రామాభివృద్ధి ప్రణాళికలపై చర్చించే గ్రామ సభలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా ప్రచారం చేయాలన్నారు.

పథకాలపై పాడి రైతులకు అవగాహన అవసరం

చీడికాడ : ప్రభుత్వం పశుసంవర్ధక శాఖద్వారా రైతులకు అందించే పథకాలపై అవగాహన కల్పించాలని పాడేరు డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డా.సి.హెచ్.నరసింహులు సూచించారు. గురువారం ఉదయం ఆయన మండలంలోని చీడికాడ, ఖండివరం ఆసుపత్రులను చుక్కపల్లి రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. గోకులం షెడ్లు, పీకేసీసీ రుణాలు, పశు బీమా, సెక్స్ సార్టెడ్ సెమన్ పథకాలపై పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

గొలుగొండ : సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం పలు ప్రభుత్వ పాఠశాలలో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 8,9,10తో పాటు ఇంటర్ విద్యార్థులకు తల్లిదండ్రులపై ప్రేమానురాగాలు, దైవభక్తి అనే అంశంపై పోటీలు నిర్వహించగా విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జోరుగా ఈకేవైసీ నమోదు


వడ్డిప రామాలయం వద్ద రైతులకు ఈ-కేవైసీ చేస్తున్న అగ్రికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్ శివ

రోలుగుంట : ప్రభుత్వ పథకాల్లో అర్హత పొందాలంటే ప్రతి రైతు ఈ-క్రాప్‌తో పాటు ఈ-కేవైసీ విధిగా చేయించుకోవాల్సి ఉంది. అందుకుగానుఈ-క్రాప్‌నకు గడువు ఈనెల 25తో ముగియగా, ఈ-కేవైసీకి ఈ నెల 28 (రేపటి) వరకూ గడువు ఉంది. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు ఆయా సచివాలయాల సిబ్బంది ఈ-కేవైసీ చేస్తున్నారు. వడ్డిప గ్రామంలో గల రామాలయం వద్ద రత్నంపేట రత్నంపేట సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న అగ్రికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్ ఎల్.శివ రైతులను రప్పించి ఈ-కేవైసీ చేశారు. గురువారం ఒక్కరోజే 35 మంది రైతులకు ఈ-కేవైసీ చేయించినట్టు తెలిపారు.

ప్రజా ఫిర్యాదుల వ్యవస్థతో ఒరిగేదేం లేదు

నర్సీపట్నం : ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థతో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని రెల్లిహక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వై.పాపారావు పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల వ్యవస్థలో అధికారులు అర్జీలు తీసుకోవడం తప్ప సమస్యలు పరిష్కరించలేదన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థతో ప్రజలకు ఒరిగింది లేదన్నారు. సమస్యలు పరిష్కరించని ఈ వ్యవస్థను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రతి సమస్యకు పరిష్కారం చూపేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైవాడ పరీవాహక గ్రామాలు అప్రమత్తంగా ఉండాలి

దేవరాపల్లి : రైవాడ జలాశయం నీటిని స్పిల్‌వే గేట్ల ద్వారా ఏ క్షణంలోనైనా విడుదల చేసే అవకాశం ఉన్నందున శారదానది పరీవాహక ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం సూచించారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ చాంబర్‌లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, బోయిలకింతాడ సర్పంచ్ బూరె బాబూరావు, ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకట రమణతో కలిసి గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలతో రైవాడ జలాశయం నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో అధికారులు స్పిల్ వే గేట్ల ద్వారా దిగువకు నీరు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. శారదానది అవతలి వైపు పశువుల పాకలు, పంట పొలాలు ఉన్న ప్రజలు నది దాటే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

గోవాడ సుగర్స్‌ను ఆదుకోవాలి


చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసుబాబు

కె.కోటపాడు : ఫ్యాక్టరీ యాజమాన్యం పెరిగిన చెరకు పంట సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకొని మేలైన మద్దతు ధరను ప్రకటించాలని ఏపీ చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు కాసుబాబు అన్నారు. కె.కోటపాడులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ప్రతి ఏటా 5 లక్షల టన్నుల క్రషింగ్‌ను గోవాడ సుగర్ ఫ్యాక్టరీ చేసేదని అన్నారు. ప్రస్తుతం నేడు క్రషింగ్ లక్ష టన్నులకు పరిమితం కావడం చూస్తే సరైన మద్దతు ధర లేక రైతులు సాగుకు నిరాసక్తత చూపుతున్నట్టు అర్థం అవుతుందన్నారు. చెరకు సాగును రైతులు పెంచే విధంగా ఫ్యాక్టరీ నుంచి ఏ విధమైన ప్రోత్సాహం అందడం లేదని కాసుబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా గత ఏడాది ఫ్యాక్టరీకి చెరకును తరలించిన రైతులకు ఉన్న బకాయిలను వెంటనే యాజమాన్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీకి పూర్వ వైభవం తీసుకువస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించినా కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

రామచంద్రపురంలో నీటికి కటకట


గ్రామంలో తాగునీటి కోసం ఆందోళన చేస్తున్న మహిళలు

గొలుగొండ : రామచంద్రపురం గ్రామంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించలేదని తెలుపుతూ గురువారం గ్రామంలో మహిళలు ఆందోళన చేపట్టారు. లింగంపేట పంచాయతీ శివారు గ్రామం అయిన రామచంద్రపురంలో సోలార్ సిస్టమ్‌తో పనిచేసే తాగునీటి పథకం ఉంది. ఇది గత కొద్ది రోజులుగా పని చేయడం లేదు. దీనివల్ల గ్రామంలో 50 కుటుంబాలకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. పలుసార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం కనిపించలేదని ఆవేదన చెందారు. తాగునీటి పథకం పనిచేయక, చేతి పంపు బోర్లు మరమ్మతులకు గురి కావడంతో దూర ప్రాంతాలకు వెళ్లి తాగునీరు ఇంటికి తీసుకురావడం జరుగుతుందని దీనివల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందారు. తాగునీటి పథకం మరమ్మతులు చేపట్టకపోతే మండల కేంద్రంలో ఆందోళన చేస్తామని మహిళలు హెచ్చరించారు.

జీతాలు మంజూరు చేయాలి


ఎంఈవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీఆర్ఎంటీలు

గొలుగొండ : రెండు నెలలు నుంచి జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, సమగ్ర శిక్షణ అభియాన్ సొసైటీలో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు చెల్లింపుల్లో అధికారులు సరిగ్గా పనిచేయలేదని కోరుతూ గురువారం ఎంఈవో కార్యాలయం వద్ద సీఆర్ఎంటీల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. మండల యూనియన్ నాయకులు రామకృష్ణ, సత్యనారాయణ, నూకరాజు మాట్లాడుతూ రెండు నెలల నుంచి జీతాలు మంజూరు కాక ఇబ్బందులు పడుతున్నామన్నారు. శాశ్వత ఉద్యోగస్తులు వలే ప్రతి నెలా జీతాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, అయినా సకాలంలో జీతాలు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతి నెలా 1న జీతాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సమగ్ర శిక్షణలో పనిచేసే సిబ్బంది పాల్గొన్నారు.

2502 దోమతెరల పంపిణీకి ఏర్పాట్లు


వాహనాలపై పంచాయతీలకు దోమ తెరలు తరలిస్తున్న ఎంపీడీవో పార్థసారథి

నాతవరం : మండలంలో గల గిరిజన గ్రామాలకు పాడేరు ఐటీడీఏ నుంచి వచ్చిన దోమతెరలు పంపిణీ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఎంపీడీవో పోలుపర్తి పార్థసారథి అన్నారు. పాడేరు ఐటీడీఏ నుంచి మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన దోమ తెరలను గిరిజన గ్రామాలకు గురువారం ఎంపీడీవో ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శుల ద్వారా ప్రత్యేక వాహనాలపై తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 34 గిరిజన గ్రామాలు ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల్లో గిరిజనులకు పాడేరు ఐటీడీఏ ద్వారా 2502 దోమతెరలు వచ్చాయని, కుటుంబాల వారీగా పంపిణీ చేస్తామన్నారు.

దేవరాపల్లి : గిరిజన గ్రామాల్లోని ప్రజలంతా తప్పకుండా ప్రభుత్వం సరఫరా చేసిన దోమ తెరలను వినియోగించుకోవాలని స్థానిక ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వం సరఫరా చేసిన దోమ తెరలను స్థానిక పంచాయతీ కార్యదర్శులకు గురువారం ఆయన అందజేశారు. మండలంలోని చింతలపూడి, తామరబ్బ, వాలాబు, గరిశింగి గిరిజన గ్రామాలకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిందన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీ


ప్రజావేదికలో పాల్గొన్న ఏపీడీ రోజారాణి, ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ సత్యం, బాబూరావు

దేవరాపల్లి : సామాజిక తనిఖీని పారదర్శకంగా నిర్వహించడం ద్వారా ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు అడ్డుకట్ట వేయవచ్చునని ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ మండల ప్రజావేదిక సమావేశంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బూరె బాబూరావుతో కలిసి ఆమె పాల్గొన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో 2023 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన పనులపై 16వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి ఈ నెల 9 నుంచి 25 వరకు సోషల్ బృందాలు గ్రామస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. గ్రామాల వారీగా గుర్తించిన లోపాలు ఇతరత్రా అంశాలను సభ దృష్టికి తీసుకు రాగా డ్వామా అడిషనల్ పీడీ ఎం.రోజారాణి వివరాలను నమోదు చేసుకున్నారు. జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి, చోడవరం క్లస్టర్ ఏపీడీ శ్రీనివాస్, ఎంపీడీవో సువర్ణరాజు, సోషల్ ఆడిట్ స్టేట్ రిసోర్స్ పర్సన్ రాజేంద్ర, ఏపీవో చంద్రకళ పాల్గొన్నారు.

మార్చి కల్లా పీఎంఏవై ఇళ్లు పూర్తి చేయాలి

కె.కోటపాడు : పీఎంఏవై రెండో దశ లబ్ధిదారులు మార్చి 25లోగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం హౌసింగ్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశంలో ఆమె మాట్లాడారు.ఆవాస్ యోజన పథకంలో రెండో దశలో ఇంటి నిర్మాణ అనుమతులు పొంది నిర్మాణా ల్లో ఉన్న 286 ఇళ్లను పూర్తి చేసేలా చర్యలు తీసు కోవాలన్నారు.

మాకవరపాలెం : గత ప్రభుత్వంలో మంజూరైన గృహాలకు వచ్చే ఏడాది మార్చి వరకే బిల్లులు చెల్లిస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతామహాలక్ష్మి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. లింటల్, రూఫ్ లెవెల్‌లో ఉన్న గృహాలను డిసెంబర్‌లోగా, బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న గృహాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలన్నారు. గడువులోగా నిర్మాణాలు పూర్తి చేస్తే లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తామన్నారు.

క్వారీ లారీ బోల్తా

మాకవరపాలెం : భారీక్వారీ లారీ బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. జి.వెంకటాపురం సమీపంలో ఉన్న నల్లరాతి క్వారీ నుంచి రాంబిల్లి మండలంలో జరుగుతున్న నేవల్ బేస్ పనులకు నిత్యం లారీలపై నల్లరాయిని తరలిస్తున్నారు. అయితే గురువారం క్వారీ నుంచి బయలుదేరిన ఒక లారీ ఈ గ్రామ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో వాహనాలు ఏవీ రాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు

మాడుగుల: మండలంలో మామిడిపాలెం నుంచి డి.గొటివాడ మీదుగా ప్రవహిస్తున్న ఉరక గెడ్డ, గౌరిగెడ్డ, తాచేరులు గురువారం నుండి పొంగి ప్రవహిస్తున్నాయి. కొత్తవలస, రాజంపేట, గొప్పూరు, తుమ్మవానిపాలెం, సాగరం, మాడుగుల గ్రామస్తులు గెడ్డలు దాటలేక ఇబ్బందులు పడుతున్నారు.

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. కురిసిన వర్షం వరిపంటకు మేలు చేస్తుందని సాగు రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వరినాట్లు వేసిన తరువాత కురిసిన వర్షాలు పంటకు మేలు చేసాయి. ఇటీవల 10 రోజులుగా వర్షాలు పడకపోవడంతో పలు గ్రామాల్లో వరి నాట్లు వేసిన పొలాలు నెర్రెలు వారాయి. ఈ నేపథ్యంలో కురిసిన భారీ వర్షంతో వరి పోలాల్లోనికి నీరు చేరుకుంది.

నేడు మెగా రక్తదాన శిబిరం

చోడవరం రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. కళాశాల జాతీయ సేవా పథకం మూడు యూనిట్లు, విశాఖపట్నం న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంకు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, విశ్వనాథ్ టిపు ఇన్‌స్టిట్యూట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం జరుగుతుందన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిబిరం ఉంటుందని, రక్తదాతలు శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. రక్తదాతలకు ఉచితంగా 3 లక్షల రూపాయల విలువైన ప్రమాద బీమా సదుపాయం నిర్వాహకులు అందచేస్తారని ఆ ప్రకటనలో తెలిపారు.

53 మంది రైతులకు పంట నష్టం ప్రతిపాదనలు

రోలుగుంట : ఇటీవల భారీ వర్షాలకు మండలంలో పలు గ్రామాలకు చెందిన సుమారు 9.29 హెక్టార్ల విస్తీర్ణంలో పంట నష్టం జరిగిందని మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి నివేదికను ప్రభుత్వానికి నివేదించారు. మండలంలో పడాలపాలెం, కొమరవోలు, అడ్డసరం పంచాయతీలో గల 53 మంది రైతుల పంటకు నష్టం వాటిల్లిందని తెలిపారు. వీరికి ప్రభుత్వం నష్ట అంచనాల మేరకు బాధిత రైతులందరి ఖాతాల్లో మొత్తంగా సుమారు రూ.2.32 లక్షలు జమ అవుతుందని తెలిపారు.